"పేరు"

"మోహన్‌గాంధీ"

పక్కలో బాంబు పడ్డట్టు అదిరిపడ్డాడు చౌదరి.

నిరాహారదీక్ష శిబిరంలో కూర్చుని హత్య చేయబడ్డ మోహన్‌గాంధి కొడుకు విశ్వ...

నుదుట పట్టిన చెమటని తుడుచుకుంటూ అన్నాడు "నీ పట్టుదలని అభినందిస్తున్నాను విశ్వా. నీకు పెట్టుబడిగా ఐదు లక్షలు నేనిస్తాను."

క్షణం ఆగి అన్నాడు విశ్వ "ఒకవేళ నేను ఓడితే. . ."

"నువ్వు తీర్చనక్కరలేదు విశ్వా" సాలోచనగా అన్నాడు ఆయన. "ఒక నిజాయితీ పరుడయిన వ్యక్తికి కొడుకువైన నువ్వు ఓడే ప్రసక్తిలేదు విశ్వా. ఒకవేళ ఓడావనుకో డబ్బుకి బదులు నువ్వేం చేయాలో నేను చెబుతాగా."

హామీ యిచ్చి పంపిన ఆయన ప్రశాంతంగా నవ్వుకున్నాడు.

లేనివాడికి పేదరికమే శత్రువైతే, ఉన్నవాడికి ప్రతి పేదవాడూ శత్రువే. . . అందులోనూ పగతోబాటు తెలివీ వున్నవాడు ప్రత్యర్ధి ఐతే ఇక ఆ పోరాటం చూడ ముచ్చటగా వుంటుంది.

నిన్నగాక మొన్న కృషి గెలుపుతో గాయపడివున్న చౌదరి పెదవులకి అంటుకున్న రక్తాన్ని నాలుకతో నాకే పులిలా క్షణం రిలాక్సయి ఆ తర్వాత కృషికి ఫోను చేశాడు.

"హల్లో" కృషి కంఠం వినిపించింది.

"నేనే" నవ్వేడు చౌదరి తోడేలులా. "మరేం లేదు కృషీ. . . ప్రతిసారీ నువ్వు ఫోను చెయ్యడం నచ్చక ఈ సారి నేనే ముందు శ్రద్ధ తీసుకున్నాను."

"చెప్పు"

"నీ మీద యుద్ధం ప్రకటించిన విశ్వకి నేను పెట్టుబడిగా డబ్బివ్వబోతున్నాను."

క్షణం ఆగి అంది ఆమె. "అంటే మరోసారి ఓడిపోతున్నావన్నమాట"

"ఓడినా ఈ సారి నేనే గెలుస్తాను కృషీ" నిగూఢంగా అన్నాడు.

"నీ మీద నీ కెంత నమ్మకం!"

"నమ్మకమంటూ లేకపోతే యుద్ధభూమిలో అడుగు పెట్టలేము. పైగా నా తోక తొక్కావుగా. . . కాటుకి సిద్ధంగా వుండు" ఆయన ఫోను క్రెడిల్ చేశాక కొన్ని క్షణాలదాకా తేరుకోలేకపోయింది.

విశ్వా పూర్తిగా చౌదరి మనిషైపోతున్నాడు.

ఎందుకు ఇంత మొండితనాన్ని ప్రదర్శిస్తున్నాగాని నేర ప్రపంచంలో కూరుకు పోతున్నాడు.

ఇక పోటీ తప్పదని తెలీడంతో ప్రిపరేషన్ ప్రారంభించింది కృషి ఆ రాత్రే. . .

ఓటమి కన్నా ఇలా ఓడిపోవడం ఆమెకు నచ్చని విషయం.

కాకతాళీయంగా.

మొత్తం పేజంతా ఆక్రమించిన ఆ అనౌన్స్‌మెంట్ చౌదరీ లేబరేటరీస్ పబ్లిక్ ఇష్యూకి సంబంధించింది.

అక్కడ చౌదరి అనే పేరే కనిపించి వుండకపోతే కేజువల్‌గా పేజి మరల్చేదే. . .

ఆసక్తిగా ప్రమోటర్స్ వివరాలు చదివింది. ఆమె అంచనా తప్పు కాలేదు. ప్రమోటర్స్ లిస్టులో మొదటి పేరు రామనాథ చౌదరీదే. సుమారు కోటిన్నర ఈక్విటీ షేర్స్ అమ్మకం కోసం షేర్ హోల్డర్స్‌గా ప్రజల్ని ఆహ్వానిస్తూ వారం రోజుల్లో ఇష్యు క్లోజవుతుందని వివరించబడి ఉంది.

ఇష్యూ హైలెట్స్‌ని ఏకాగ్రతగా చదివింది.

A SENSATIONAL INNOVATION OF "PROCALCIATE"

స్త్రీల మెనుస్ట్రేషన్ పీరియడ్‌లో కడుపునొప్పి మానసిక వైకల్యాన్ని నివారించడానికి ఉపయోగించే కాల్షియం డ్రగ్ PROCALCIATE. . .ఇంకా చాలా వివరాలున్నాయి. అన్నింటికన్నా ఆమెను అమితంగా ఆకట్టుకున్న విషయం చౌదరి లేబరేటరీస్‌లో తయారయ్యే PROCALCIATE నూరుపాళ్ళు అమెరికా ఎగుమతికి నిర్ధేశించబడినది.

చౌదరి పబ్లిక్ లిమిటెడ్ కంపెనీ ప్రారంభించి మరో ఆరు నెలల్లో అరుదయిన ప్రోడక్ట్‌తో మార్కెట్‌లో అడుగుపెడుతున్నాడు.

ప్రత్యర్థి విషయంలో అవసరానికి మించిన శ్రద్ధ చూపించడం వ్యాపార లక్షణం ఒక్కటే కాదు యుద్ధనీతి కూడా . . .

ప్రభుత్వంలో చాలా పలుకుబడి గల చౌదర్ని మాత్రమే గాక అలాంటి వాడికి కొమ్ము కాసే ప్రభుత్వ చిత్తశుద్ధినీ శంకిస్తున్నట్టుగా వెంటనే న్యూయార్క్‌కి ఫోన్ చేసింది.

తన మిత్రుడు న్యూ డీల్ కన్సల్టెన్సీ అధిపతి మిస్టర్ సీగల్ లైన్‌లోకి వచ్చాడు.

“ కృషి ఫ్రం ఇండియా. . .”

“వాటే సర్‌ప్రయిజ్. . . అమెరికాని మరిచిపోయారు” సీగల్ అభిమానాన్ని ప్రకటించాడు.

“మరిచిపోతే మీకు ఫోను చేసేదాన్ని కాదు మిస్టర్ సీగల్” క్షణం ఆగి అంది “మీరో సహాయం చెయ్యాలి”

“ఆదేశించు మిస్ కృషీ”

“ఇండియా నుంచి ఫార్మాస్యూటికల్స్‌ని మీ కంట్రీ దిగుమతి చేసుకోవాలీ అంటే మీ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ లైసెన్సు కావాలిగా” చౌదరి లేబ్స్ వివరాలు తెలియజేసి “మీ FDA లైసెన్సు ఇచ్చిందో లేదో కనుక్కొని తెలియచేయగలరా. . .”

“మా ఎఫ్‌డియె పొలిటికల్లీ మోటివేటెట్ బాడీ కాబట్టి లైసెన్సు సంపాదించడం కష్టం కాదు. . . ఎనీ హౌ తెలుసుకొని చెబుతాను.”

“మరో గంటన్నరలో న్యూయార్క్ నుంచి ఫోను చేస్తాడు సీగల్. “యూ ఆర్ రైట్ మిస్ కృషి చౌదరీ లేబరేటర్స్ వాళ్ళు లైసెన్సు కోసం అప్లయ్ చేసారు తప్ప ఇంకా లైసెన్సు పొందలేదు. . .”

అంతే. . .

ఆమె పిడికిలి బిగుసుకుంది. . .

రామనాథచౌదరి ప్రభుత్వంలోని కీలకమైన వ్యక్తులు కోట్ల మంది ప్రజల్ని మోసగించడానికి సిద్ధపడ్డాడు - లేనిది వుందని భ్రమింపచేస్తూ. . .

చేతికి చిక్కిన ఓ మారణాయుధాన్ని సంధించడనికి సిద్ధమైంది కృషి.

కేవలం ఇరవై నాలుగంటల వ్యవధిలో. . .

ఇంకా పాతికేళ్ళ వయసైనా లేని కృషి ఎలాంటి సంచలనానికి కారణమైందీ అంటే చౌదరీ లేబరేటరీస్ పబ్లిక్ ఇష్యూ నిజాయితీ శంకించకూడదూ అంటే అమెరికా దేశానికి చెందిన ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ లైసెన్స్ వుందో లేదో స్పష్టం చేయాలని.

పత్రికా ముఖంగా రామనాథచౌదరిని ఛాలెంజ్ చేసింది ఒక కోటీశ్వరుడి మనుమరాలు ఏర్పాటు చేసిన కాన్ఫరెన్స్ కావడంతో మొత్తం పత్రికలు కవర్ చేసాయా వార్తని. . . తేలు కుట్టిన దొంగలా వుండిపోయాడు రమనాథచౌదరి.

పత్రికల్లో వచ్చిన వార్తకి కంపెనీ ప్రమోటర్స్ ఎలాంటి రెస్పాన్స్ ఇవ్వకపోవడంతో షేర్స్ కోసం అప్లయి చేయబోయిన జనం వెనక్కి తగ్గడమే గాక కొందరు స్టాక్ ఎక్స్చేంజ్ బ్రోకర్సు న్యాయబద్ధమైన జవాబు నర్ధిస్తూ కోర్టుకి వెళ్ళారు. . .స్టే ఇవ్వబడింది ఇష్యూ పై.

మరుసటి రోజు లోక్‌సభలో ఫైనాన్స్ మినిస్టర్ని ఇదే విషయంపై నిలదీశారు ప్రతిపక్ష సభ్యులు. . . ఈ మధ్య కాలంలో దేశాన్ని అట్టుడికించిన స్కామ్స్ గురించి, బ్యూరో క్రాట్స్ వైఫల్యం గురించి ఉటంకిస్తూ ఇలాంటి విషయాల్ని తరచి చూడాల్సిన SECURITIES AND EXCHANGE BOARD OF INDIA చైర్మన్ మీద చర్య తీసుకోవాలని కేకలు పెట్టారు.

జరిగిన తప్పిదాన్ని అంగీకరించాడు కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి. . . అంతే గాకుండా FDA లైసెన్స్ కోసం అప్లయ్ చేయటమే జరిగింది తప్ప చౌదరీ లేబ్స్ యింకా లైసెన్సు పొందలేదని తెలియచేస్తూ ఆ కంపెనీ మీద చర్యతో బాటు ప్రభుత్వంలో వారికి సహకరించిన అధికారుల్నీ శిక్షించడం జరుగుతుందని హామీ యిచ్చాడు. . దేశం మొత్తం చర్చించుకున్న సమస్య ఇది.

కృషి దెబ్బకి కంపించిపోయాడు చౌదరి. అది కాదు, కోట్లనష్టంతో ఆడదాన్ని చిన్న చూపు చూడకూడదన్న సత్యాన్ని తెలుసుకున్న తొలి అనుభవమది.

0 0 0 0

ఏప్రిల్ పదిహేనో తేదీ

సాయంకాలం ఆరుగంటలు కావస్తూంది.

యూనివర్శిటీ ఆడిటోరియం విద్యార్థులూ, పత్రికా విలేకర్లతో సందడిగా వుంది.

ఒక అరుదైన పోటీని తిలకించాలనే సంకల్పంతో నగర ప్రజలూ ఆరోజు అక్కడికి చేరుకున్నారు.

"డియర్ ఫ్రెండ్స్ " ఢిల్లీ నుంచి క్విజ్ మాస్టరుగా వచ్చిన సత్యేంద్రబసు ప్రేక్షకుల్ని చూస్తూ అన్నాడు "దిసీజె రేర్ అండ్ ఇంట్రెస్టింగ్ కాంపిటీషన్. . .ఇందులో పార్టిసిపేట్ చేస్తున్న ఇద్దరిలో ఒకరైన మిస్ కృషి పుట్టింది కోటీశ్వరుల వంశంలో, పెరిగింది చదివింది స్టేట్స్‌లో. . . రెండో వ్యక్తి మిస్టర్ విశ్వనాథ్. . . ఇక్కడ క్విజ్ కాంపిటీషన్స్‌లో తరచుగా పార్టిసిపేట్ చేసే వ్యక్తి. . నౌ" వేదికపై కూర్చున్న ఇద్దరు పార్టిసిపెంట్స్‌తో అన్నాడు

"సరిగ్గా మరో ఐదు నిముషాల్లో అంటే ఆరుగంటల పదిహేను నిముషాలకి పోటీ ప్రారంభమవుతుంది పోటీ గడువు అరవై నిముషాలు. . . ప్రశ్న అడిగేక జవాబు చెప్పడానికి యివ్వబడే గడువు పది సెకండ్లు మాత్రమే. ముందుగా ప్రశ్నలు అడిగేది మిస్ కృషి.

కృషి వెంటనే జోక్యం చేసుకుంది "లేడీస్ ఫస్టన్న సూత్రాన్ని మీరు ఫాలో అవ్వనక్కరలేదు. కావాలంటే విశ్వనాథ్‌నే ప్రారంభించమనండి."

అప్పటికే అయిదు లక్షల రూపాయల చెక్కుని సత్యేంద్రబసు కిచ్చిన విశ్వ అవహేళనగా అన్నాడు "క్విజ్ కాంపిటీషన్స్ అంటే అనుభవం లేని మిస్ కృషి ప్రారంభించడమే న్యాయమనుకుంటాను."

ఇక్కడ విశ్వ కావాలని జాలి ప్రదర్శిస్తున్నట్టు మాట్లాడ్డం ఆమెకు నచ్చలేదు.

ఓ కాయిన్ గాలిలోకి ఎగరవేయబోతూ సత్యేంద్ర చూశాడు కృషి వేపు. "టాస్ " అందామె.

"హెడ్" అన్నాడు విశ్వ తనకున్నది 'హెడ్' అన్న భావంతో వ్యంగ్యంగా తన తలవేపు వేలిని చూపిస్తూ.

ఆడిటోరియంలో కలకలం మొదలయింది.

'హెడ్' అన్నాడు సత్యేంద్రబసు కాయిన్ ఎగరేశాక ఫలితాన్ని నిర్ధారిస్తూ. "ఇప్పుడు పోటీ ప్రారంభించాల్సింది మిస్టర్ విశ్వనాథ్" తన చైర్‌లో కూర్చుంటూ "అరగంట గడువులో మీరు అడగాల్సింది సరిగ్గా ఇరవై అయిదు ప్రశ్నలు . . . ప్రశ్న అడగ్గానే పది సెకండ్ల లోగా జవాబు రానపుడు మీరే జవాబు చెప్పేయాలి. ఒక్కో జవాబుకి పది మార్కులు. అరగంట తర్వాత మిస్ కృషి ఎంత స్కోర్ చేసిందీ చెబుతాను" రిస్టువాచ్ చూసుకుంటూ "స్టార్ట్ " అన్నాడు.

రెండు సెకండ్ల విరామం. . .

తనకున్న మైండ్ పవర్ గురించి చాలా ధీమాని వ్యక్తం చేసిన కృషిని మొత్తం ఆ సబ్జక్టులోనే ప్రశ్నలడిగి కంగారు పెట్టాలనిపించిందేమో గొంతు సవరించుకుంటూ

"మిస్ కృషి - అమెరికాకి చెందిన మొదటి ప్రామినెంట్ సైకాలజిస్ట్ ఎవరు. అతడు సైకాలజీపై మొదట రాసిన గ్రంథమేది"

"విలియమ్ జేమ్స్. . . 1890 లో సైకాలజీ గురించి అతడు రాసిన గ్రంథం పేరు ది ప్రిన్సిపుల్స్ ఆఫ్ సైకాలజీ"

"సంగీతం మెదడుపై కలిగించే రసాయనిక ప్రభావం ఏమిటి"

"స్టేన్‌ఫర్డ్ యూనివర్శిటీకి చెందిన ఫార్మకాలజిస్ట్ డాక్టర్ అవ్రమ్‌గోల్డు స్టిన్ థియరీ ప్రకారం యిష్టమైన సంగీతం విన్నప్పుడు మెదడు ఎండోర్ఫిన్స్‌వంటి రసాయనాన్ని విడుదల చేసి, ఆనందదాయకమైన ఆలోచనల్ని రేపుతుంది."

"రైట్. . . ఒకప్పటి సినీ నటుడైన మాజీ అమెరికా ప్రెసిడెంటు రోనాల్డ్ రీగన్‌పై ఓ సినిమా ప్రభావంతో ఒక వ్యక్తి తుపాకీ పేల్చి గాయపరిచాడు. ఆ వ్యక్తిపేరు, ఆ సినిమా పేరు చెప్పండి"

"1981 మార్చి ముప్పయ్యో తేదీన రీగన్ గుండెల్లోకి బుల్లెట్‌ని షూట్ చేసిన ఆ వ్యక్తి పేరు జాన్ హింక్లే. ఆ వ్యక్తిని ప్రభావితం చేసిన ఏంటీ హీరో పాత్ర వున్న ఆ సినిమా పేరు టాక్సీ డ్రైవర్."

"రైట్. . . పసికందు పుట్టుకలో ముందు తలమాత్రమే ఎందుకు వస్తుంది."

"గ్రేవిటేషనల్ ఫోర్స్" టక్కున చెప్పింది కృషి "గర్భంలో వున్న బిడ్డ తల బరువు మిగతా భాగాల కన్నా ఎక్కువ వుండటంతోనూ మొత్తం పొడవులో తల నాలోగో వంతు ఆక్రమించడంతోనూ ప్రసవంలో ముందు తలే బయటికి వస్తుంది"

"నైస్ మిస్ కృషి. . . సగటున మగాడి మెదడు బరువు మూడు పౌండ్లయితే స్త్రీ మెదడు బరువు రెండు పౌండ్లు మాత్రమే అంటే మెదడు విషయంలో మగాడికన్నా స్త్రీ తక్కువని మీరు అంగీకరిస్తారా"

"లేదు" విశ్వ గొంతులోని ఎగతాళికి జవాబుగా తనూ వ్యంగ్యంగా అంది "మెదడు బరువుకి మేధస్సుకి సంబంధం లేదు మిస్టర్ విశ్వనాథ్. మనిషి శరీర పరిమాణాన్ని బట్టి మెదడు నిర్ణయించబడుతుంది. సహజంగా మగాడి శరీరం కాస్త భారీగా వుంటుంది కాబట్టి అదే నిష్పత్తిలో మెదడు పరిమాణం వుంటుంది. అలానే స్త్రీలలో కూడా. . ."

"స్ప్లెండిడ్" కృషి తను అనుకున్నంత బలహీనురాలు కాదని బోధపడిన విశ్వ కాస్త జటిలమైన ప్రశ్నలతో ఆమెను ఇబ్బంది పెట్టాలనుకున్నాడు. "తలకి గాయమైన మగాడిలో సెక్స్‌లో ఆసక్తి తగ్గే అవకాశముందని నిరూపించిన బ్రెయిన్ రిసెర్చర్ ఎవరు."

స్తబ్దంగా వుండిపోయింది. విశ్వ పెదవులు మృదువుగా విచ్చుకున్నాయి. ఒకటీ, రెండు పది సెకండ్లు గడిచాయి.

క్విజ్ మాస్టర్ బజర్ మోగించగానే చెప్పాడు విశ్వ.

"మాసాచు సెట్స్ జనరల్ హాస్పటల్‌కి చెందిన డాక్టర్ విలియమ్ క్రోలీ." కృషిని

“తల్లి గర్భంలో పిండంగా రూపుదిద్దుకున్న ఇరవై వారాలకి అంటుంది సైన్స్”

“రైట్. . . సెన్సాఫ్ స్మెల్ మగాళ్ళకన్నా స్త్రీలలోనే ఎక్కువంటుంది కారణం?”

“స్త్రీలలో వుండే హార్మోన్ ఈస్ట్రోజన్ స్థాయిని బట్టి ఘ్రాణశక్తి నిర్ణయించ బడుతుంది. మగాళ్ళకన్నా స్త్రీలు అధిక ఘ్రాణశక్తి కలిగి వుండటానికి కారణం ఈస్ట్రోజన్ అంటుంది సైన్స్.”

“ఊరగాయలు ఐస్‌క్రీముల్లాంటి చిత్రమైన కాంబినేషన్స్ ఎన్నుకుంటుంటారు గర్భవతులైన స్త్రీలు. కారణం చెప్పండి”

“గర్భం ధరించిన స్త్రీ కన్నా గర్భవతి కాని స్త్రీకి రెండు వేల రెట్ల ఘ్రాణశక్తి ఎక్కువంటుంది సైన్స్. గర్భవతులైన స్త్రీలలో ఈస్ట్రోజన్ స్థాయి చాలా దారుణంగా పడిపోతుంది కాబట్టి ఘ్రాణశక్తి తగ్గిపోతుంది. నాలుక చిత్రమైన రుచుల్ని కోరుకుంటుంది.”